క్లుప్తంగా

అంతగిరి ఆలయంలో ప్రసాదాలకు వేలం

సిరిసిల్లటౌన్: ఇల్లంతకుంట మండలంలోని అంతగిరి పోచమ్మ ఆలయంలో లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం, కొబ్బరిముక్కలు పోగు చేసుకునేందుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో మారుతిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 సెప్టెంబర్ 2024 నుంచి 31 ఆగస్టు 2025 ఏడాది కాలానికి టెండర్ కమ్ వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 26 మధ్యాహ్నం 12 గంటలకు సీల్డ్ కమ్ బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనే వారు లడ్డూ, పులిహోర ప్రసాదానికి రూ.లక్ష, కొబ్బరిముక్కలు పోగు చేసుకోవడానికి రూ. 20 వేలు ధరావత్తు డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుందన్నారు.

మద్యంతాగి వాహనాలు నడపొద్దు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట: రోడ్డు భద్రత అందరూ సామాజిక బాధ్యత గుర్తించాలని సీఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలకేంద్రంలో పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మద్యంతాగి వాహనాలు నడపవద్దన్నారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్సై రమాకాంత్, సిబ్బంది ఉన్నారు.

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని వట్టెంల గ్రామ శివారులోని వేములవాడ -జగిత్యాల ప్రధాన రహదారిలో వేములవాడ రూరల్ ఎస్సై మారుతి శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. కార్ల అద్దాలకు బ్లాక్ స్టిక్కర్లను గుర్తించి తొలగించారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం

ముస్తాబాద్: ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ చేసి రైతుల రుణం తీర్చుకున్నారని కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల కోకన్వీనర్ చక్రధర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు రుణమాఫీ చారిత్రత్మకమైందన్నారు. ఆరుగ్యారంటీలను అమలు చేస్తూ ప్రజాప్రభుత్వంగా కాంగ్రెస్ సర్కార్ నిలిచిందన్నారు. రైతు రుణమాఫీ చేస్తే రాజీనామాలు చేస్తామన్న బీఆర్ఎస్ నాయకులు సిద్ధంగా ఉండాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తామని మాట నిలుపుకున్నారన్నారన్నారు.


పంటల పరిశీలన



పత్తి పంటను పరిశీలిస్తున్న అధికారులు

వేములవాడరూరల్: మండలంలోని మల్లారం, జయవరం గ్రామాల్లోని రైతులు సాగుచేస్తున్న పత్తి, వరి పంటలను జిల్లా ఏరువాక కేంద్రం కరీంనగర్, వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తల బృందం శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తిలో తెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేయాలని తెలిపారు. వరిలో మొగిపురుగు నివారణకు చేపట్టాల్సిన చర్యలు సూచించారు. వ్యవసాయ పరిశోధన అధికారులు మంజులత, రాజేంద్రప్రసాద్, మధుకర్‌రావు, రైతులు తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లిలో 1996–97 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. ఒకరికొకరు పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

41 మందికి జరిమానా

తంగళ్లపల్లి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 41 మందికి కోర్టులో శుక్రవారం జరిమానాలు విధించినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మద్యంతాగి వాహనాలు నడిపిన ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.2వేలు, తొమ్మిది మందికి ఒక్కొక్కరికి రూ.15,00, 11 మందికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున, బహిరంగం ప్రదేశంలో మద్యంతాగిన 18 మందికి ఒక్కొక్కరికి రూ.210 చొప్పున 41 మందికి మొత్తం రూ.34,280 జిల్లా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి జరిమానాలు విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు. మద్యంతాగి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రమాదపుటంచున ప్రయాణం

- మండలంలో ప్రమాదకరంగా రోడ్లు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఈ చిత్రంలో కనిపిస్తున్నది మండలంలోని భూక్యతండా బ్రిడ్జి. 2021 ఆగస్టులో పనులను ప్రారంభించారు. కాగా వంతెన నిర్మాణానికి రూ.157.86 లక్షలతో వెచ్చించగా అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. ఏళ్లు గడుస్తున్నా వంతెన పనులు పూర్తికాకపోవడంతో ప్రమాదపుటంచున ప్రయాణం చేయాల్సి వస్తోందని తండా వాసులు వాపోతున్నారు. కాంట్రాక్టర్ మధ్యలోనే నిర్మాణ పనులు వదిలివేయడంతో ఆ తండావాసులు బ్రిడ్జి కింది నుంచి వేరే దారి వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టిసారించి సకాలంలో పనులు పూర్తిచేసి బ్రిడ్జిని వినియోగంలోకి తీసుకురావాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



వీర్నపల్లిలో కోతకు గురైన రోడ్డు



ఈ చిత్రంలో కనిపిస్తున్నది మండలంలోని బంజేరు – మద్దిమల్ల గ్రామాల మధ్య ఉన్నరోడ్డు. గతేడాది భారీ వర్షాలకు కల్వర్టుకు ఇరువైపులా పోసిన మట్టి కొట్టుకుపోవడంతో ప్రమాదకరంగా మారింది.రాత్రి సమయంలో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులుకు పలుసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు.

వీర్నపల్లి: మండలంలోని పలు రహదారులు ప్రమాదకరంగా మారాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ప్రమాదపుటంచున రాకపోకలు సాగించాల్సి వస్తోంది. మండల కేంద్రం మీదుగా గర్జనపల్లి వెళ్లే ప్రధానదారిపై దాదాపు 15 కల్వర్టులు ఉన్నాయి. గత వర్షాకాలంలో కల్వర్టులకు ఇరువైపులా పోసిన మట్టి కొట్టుకుపోవడంతో ప్రమాదకరంగా మారాయి. మరికొన్ని శిథిలావస్థలకు చేరాయి. గత ప్రభుత్వం మండల ప్రజలు పడుతున్న ఇబ్బందిని దృష్టిలో ఉంచుకొని నాలుగు బ్రిడ్జిలను నిర్మించింది. కానీ అధికారులు అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. కోతకు గురైన రహదారులను మరమ్మతులు చేయాల్సిన అధికారులు ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. చాలాచోట్ల భారీ వరదలకు రోడ్లు కోతకు గురై ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేయడం లేదు. దీంతో వాహనదారులకు తరచూ ప్రమాదాలు బారినపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలబారిన పడకుండా చూడాలని వారు కోరుతున్నారు.

"

ఏటా ఇబ్బంది పడుతున్నాం



మా ఇల్లు తుకం ఒర్రె వాగుకు వందమీటర్ల దూరంలో ఉంది. వాగుకు చిన్న కల్వర్టు నిర్మించి చిన్న పైపులు వేశారు. భారీ వర్షాలు కురిసినప్పుడల్లా పైపుల్లో చెత్త తట్టుకొని వాగు దగ్గరలోని ఐదు ఇళ్లలోకి నీరు రావడంతో ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలి.

– బర్మ లత, వీర్నపల్లి

పనులు పూర్తి చేయాలి



ఈ బ్రిడ్జిపై నుంచి వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నాం. తండా వాసులంతా బ్రిడ్జి కింది నుంచి సొంతంగా రోడ్డు వేసుకున్నాం. ప్రమాదాలు జరగక ముందే అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి. వంతెన పనులు పనులను సకాలంలో పూర్తిచేసి ఇబ్బందులు తొలగించాలి.

– బాదావత్ సరిత, దేవునాయక్ తండావాసి

"

జిల్లా అంతటా ముసురు వాన

సిరిసిల్ల: జిల్లాలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ముసురు వర్షం కురిసింది. బోయినపల్లి మండలంలో అత్యధికంగా 45.4 మిల్లీ మీటర్ల వర్షం పడగా.. రుద్రంగిలో 32.3, చందుర్తిలో 21.5, వేములవాడ రూరల్‌లో 44.5, వేములవాడలో 29.0, సిరిసిల్లలో 23.0, కోనరావుపేటలో 27.8, వీర్నపల్లిలో 26.2, ఎల్లారెడ్డిపేటలో 24.7, గంభీరావుపేటలో 33.9, ముస్తాబాద్‌లో 24.0, తంగళ్లపల్లిలో 16.4, ఇల్లంతకుంటలో 22.1 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ముసురు పడింది.

కరపత్రాల ఆవిష్కరణ

సిరిసిల్ల: విద్యారంగ సమస్యలు, విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించేందుకు పీడీఎస్‌యూ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తోందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు అంగిడి కుమార్ అన్నారు. సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం పీడీఎస్‌యూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థులకు విద్య అందని ద్రాక్షలాగా తయారుచేశారన్నారు. సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించడం లేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచడం లేదన్నారు. ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలు నిబంధనలు పాటించకుండా ఫీజుల పేరుతో రూ.లక్షలు వసూలు చేస్తున్నారన్నారు. కరీంనగర్‌లో జరిగే పీడీఎస్‌యూ రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు నలువల రవికుమార్, ఈశ్వర్, శ్రీను, రమేశ్, ఆకాష్, శ్రీకాంత్, సన్నీ, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

ముస్తాబాద్: గ్యాస్ వినియోగదారులు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సరోజ ఇండెన్ గ్యాస్ డీలర్ కె.దామోదర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు రెగ్యులేటర్, సురక్షా పైపు, స్టవ్‌లు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు వస్తే తమ సిబ్బందికి సమాచారం అందించాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.

సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ ముట్టడిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్

సిరిసిల్లటౌన్: వస్త్ర పరిశ్రమలో నెలకొన్న విద్యుత్, ఇతర సమస్యల పరిష్కారానికి అసెంబ్లీ ముట్టడిస్తామని సిరిసిల్ల వస్త్రోత్పత్తి, అనుబంధ రంగాల జేఏసీ అధ్యక్షుడు తాటిపాముల దామోదర్ అన్నారు. శుక్రవారం చేనేత, వస్త్ర వ్యాపార సంఘ భవనంలో నిర్వహించిన సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఈనెల 22న అంబేద్కర్‌చౌక్‌లో రిలేదీక్షలు, వంటావార్పు కార్యక్రమాలు, 23న రాస్తారోకో, 24న సిరిసిల్ల బంద్, 25న ఛలో హైదరాబాద్ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాలు చేపట్టేందుకు తీర్మానించినట్లు తెలిపారు. పరిశ్రమ, 30 వేల కుటుంబాల భవిష్యత్తు కోసం జేఏసీ ఆధ్వర్యంలో కార్యాచరణ చేపట్టినట్లు వెల్లడించారు. ఈనెల 22 నుంచి జరిగే కార్యక్రమాల్లో వస్త్ర పరిశ్రమ, అనుబంధ రంగాల కార్మికులు, ఆసాములు, యజమానులు అందరూ పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పాలిస్టర్ వస్త్రోత్పత్తి సంఘం అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, ఆసాముల కమిటీ కన్వీనర్ సిరిసిల్ల రవిందర్, ఏఐటీయూసీ కార్యదర్శి పంతం రవి, సీఐటీయూ కార్యదర్శి మూశం రమేశ్, ఆంకారపు రవి, పోలు శంకర్, కట్టికోల లక్ష్మీనారాయణ, పిస్క మధు, కోడం అశోక్, మండల సత్యం, ఎల్లండి దేవదాసు, మోర రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



బోయినపల్లి: ఆర్థికసాయం అందిస్తున్న బీజేపీ నాయకులు

బోయినపల్లి: మండలంలోని మర్లపేటకు చెందిన బీజేపీ కార్యకర్త నక్క సాయికృష్ణ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాధిత కుటుంబానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పంపిన రూ.50 వేలను శుక్రవారం చొప్పదండి నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవణ్, పార్టీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డితో కలిసి అందించారు. ఇక్కడ ఉదారి నర్సింహాచారి, ఎడపల్లి పరశురాం, కొనుకటి హరీశ్, క్యాతం తిరుపతిరెడ్డి, సుంకపాక ప్రభు, మారం ఉపేందర్, శ్రీనివాసరెడ్డి, సూదుల హరీశ్, తిరుపతి, గొట్ల ఐలయ్య తదితరులు ఉన్నారు.

వేములవాడ: సిరిసిల్ల పట్టణం సుభాష్‌నగర్‌కు చెందిన కలికోట లక్ష్మణ్ కుమారుడు అభినయ్ కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. తన కుమారుడి వైద్యంకోసం రూ.15 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారని లక్ష్మణ్ మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు సభ్యుల్ని సంప్రదించాడు. దాతల సహకారంతో రూ.10వేలు పోగుచేసిన ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేసినట్లు ట్రస్టు సభ్యులు మధు మహేశ్, గొంగళ్ల రవికుమార్, పాలాస రాజేందర్, నక్క వేణు, కళా అశోక్ తెలిపారు. సిరిసిల్ల మాజీ కౌన్సిలర్ ఎల్లె లక్ష్మీనారాయణ కాలనీవాసులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

20 నుంచి ప్రత్యేక తరగతులు

సిరిసిల్లకల్చరల్: భగవద్గీతపై ఈనెల 20 నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం పట్టణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. శివనగర్‌లోని అంకారపు నర్సయ్య ఫంక్షన్ హాల్‌లో సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ప్రవచనానంతరం హాజరైన భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా నిర్వాహకులు కోరుతున్నారు.

28న ముస్లిం టౌన్ కమిటీ ఎన్నికలు

వేములవాడ: వేములవాడ ముస్లిం టౌన్ కమిటీ ఎన్నికలను ఈనెల 28న ఉర్దూ మీడియం స్కూల్‌లో పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు సయ్యద్ సాధిక్, సయ్యద్ బాబా, ఎండీ రఫీక్, శకీల్, అజ్మత్, ఇఫ్తికార్, శబ్బీర్ శుక్రవారం తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తికాగానే ఓట్ల లెక్కింపు ఉంటుందని, తర్వాత ఫలితాలు వెల్లడిస్తామన్నారు. ఈనెల 19, 20వ తేదీల్లో ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 3 గంటలవరకు నామినేషన్ల ప్రక్రియ ఉంటుందని, శుక్రవారం ప్రెసిడెంట్‌కు మూడు నామినేషన్లు, సెక్రటరీకి ఒక నామినేషన్ దాఖలైనట్లు చెప్పారు. ఈనెల 21న అభ్యర్థులకు గుర్తులు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మొత్తం 920మంది సభ్యులు తమ సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

రుద్రంగి: మండలకేంద్రంలోని కేజీబీవీలోని వసతిగృహంలో నాన్ టీచింగ్ స్టాఫ్ (అసిస్టెంట్ కుక్ -01) కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల ఇన్‌చార్జ్ ఎంఈవో శ్రీనివాస్ దీక్షితులు ఒక ప్రకటణలో తెలిపారు. దరఖాస్తులను రుద్రంగి జెడ్పీ హైస్కూల్‌లో ఈనెల 20 నుంచి 25లోపు అందించాలన్నారు. అభ్యర్థులు 7వ తరగతి పాసై ఉండాలని, స్థానికంగా ఉండేవారికి ప్రాధాన్యం కల్పిస్తామన్నారు.

రైతులతో ముచ్చటించిన ప్రభుత్వ విప్

వేములవాడఅర్బన్: మండలంలోని రుద్రవరం గ్రామంలోని రైతులతో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం ముచ్చటించారు. ప్రభుత్వం చేయడంపట్ల రుణమాఫీతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ చరిత్రలో ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఒక మోడల్ కాబోతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, మాజీ సర్పంచ్‌లు కదిరె రాజుకుమార్, పండుగ ప్రదీప్, కత్తి కనుకయ్య, ఎర్రం ఆగయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం పొత్తూర్ గ్రామశివారు బిక్కవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం ఉదయం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఇసుక ట్రాక్టర్‌ను సీజ్‌చేసి అక్రమంగా ఇసుక తరలిస్తున్న చిట్యాల అంజయ్య, కుంభం శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

కోనరావుపేట: తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. మండలంలోని మర్తనపేట గ్రామానికి చెందిన జవ్వాజి శేఖర్ గౌడ్(45) కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కగా మోకుజారి కిందపడ్డాడు. శేఖర్‌గౌడ్‌కు గాయాలు కాగా చికిత్స నిమిత్తం సిరిసిల్లలోని ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు..

రుద్రంగి: రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. మండలకేంద్రంలోని గంగమ్మ కమాన్ ఆవరణలో వేములవాడ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు రోడ్డుపై నిలపడంతో వెనుక నుంచి బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మండలకేంద్రానికి చెందిన పండుగు శ్రీని వాస్‌కు స్వల్పగాయాలు కాగా అతడి మాధవి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వేములవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

23 మందికి కు.ని ఆపరేషన్లు



సిరిసిల్లటౌన్: జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల సుందరయ్యనగర్ యూహెచ్‌సీలో శుక్రవారం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ మోహన్‌రావు మాట్లాడుతూ..ప్రపంచ జనాభా నియంత్రణ పక్షోత్సవాల్లో భాగంగా జరిగిన కు.ని.శిబిరంలో 23 మందికి ఆపరేషన్లు నిర్వహించినట్లు తెలిపారు. డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత, వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీప్రసన్న, సీవో వాణి, పద్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలు సంరక్షించాలి

ముస్తాబాద్: మండలకేంద్రంలో వన మహోత్సవానికి నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేశామని ఈవో రమేశ్ తెలిపారు. రెండ్రోజులుగా ఇంటింటికీ వెళ్లి 2 వేల మొక్కలు పంపిణీ చేశామన్నారు. మండలకేంద్రంలో 6 వేల మొక్కలు నాటేందుకు ఉపాధిహామీ ద్వారా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాటిన మొక్కలను కాపాడాలని కోరారు. ప్రతిఒక్కరూ రెండు మొక్కలు నాటాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి



చందుర్తి: వర్షాల దృష్ట్యా ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి కోరారు. మండలంలోని మల్యాల, జోగాపూర్, రామన్నపేట గ్రామాల ఆర్‌అండ్‌బీ లోలెవల్ కాజేవేలను శుక్రవారం ఆమె పరిశీలించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు ప్రయాణాలను వాయిదా వేసుకుంటే మేలన్నారు. వరద ఉధృతిగా ఉండే ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, బోర్డులను ఏర్పాటు చేయించాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా ఏఎస్పీ మొక్కలు నాటారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీకాంత్ పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలను వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి శుక్రవారం రాత్రి సందర్శించారు. రాజన్న కోడెల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆలయ అధికారులు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



తంగళ్లపల్లి: జిల్లెల్లలో సంబరాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ నాయకుల ర్యాలీ

తంగళ్లపల్లి: రైతులకు రుణమాఫీ చేయడంతో శుక్రవారం కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జేటోని ఆధ్వర్యంలో మండలకేంద్రం నుంచి జిల్లెల్ల వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లెల్ల అంబేద్కర్ విగ్రహం ఎదుట సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లింగాల భూపతి, బైరినేని రాము, నేరెళ్ల నర్సింగం గౌడ్, చుక్క రాజశేఖర్, గడ్డం మధుకర్ (ఛోటు), మిరాల శ్రీనివాస్ యాదవ్, జూపెల్లి రాజేశ్వర్‌రావు, పరుశరాములు, రెడ్డి పరుశరాములు, జనార్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: రైతులకు రూ.లక్షలోపు రుణమాఫీ చేయడాన్ని హర్షిస్తూ మండలంలోని ఆవునూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు సారగొండ రాంరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గుండం నర్సయ్య, డీసీసీ ప్రధాన కార్యదర్శి మిర్యాల్‌కార్ శ్రీనివాస్, భాను, రైతులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: రైతులకు రూ.లక్షవరకు రుణమాఫీ చేయడాన్ని హర్షిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మండల కాంగ్రెస్ నాయకులు, రైతులు క్షీరాభిషేకం చేశారు. గాంధీ విగ్రహం నుంచి పాత బస్టాండ్ వరకు రైతులు భారీ ర్యాలీ నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్, లింగంగౌడ్, గిరిధర్‌రెడ్డి, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, గంట బుచ్చాగౌడ్, బాబు, బాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజేందర్, రాజు, మల్లారెడ్డి, రవి, బాలాగౌడ్, శ్రీకాంత్, ఇమామ్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రుణమాఫీ సంబరాలు జరిపారు. నాయకులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు హమీద్, జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.


వీర్నపల్లి: మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి సంబరాలు జరిపారు. మండల ప్రధాన కార్యదర్శి రాముల నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతి యాదవ్ ,ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హరిలాల్ నాయక్, మాజీ సర్పంచ్ పాటి దినాకర్,లెంకల లక్ష్మణ్, గ్రామశాఖ అధ్యక్షులు చంద్రమౌళి, దేవయ్య సంతోష్, నాయక్, నాగరాజు, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు సన్మానం



కోనరావుపేట: ట్రిపుల్ ఐటీలో అర్హత సాధించిన ఇద్దరు విద్యార్థులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. సుద్దాల గ్రామానికి చెందిన ఎరవెల్లి అక్షిత, లక్కం అక్షయ పదో తరగతిలో ప్రతిభ చూపి బాసర ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యారు. అంబేద్కర్ సంఘం (మాల) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షుడు ఎరవెల్లి రాజయ్య, నాయకులు ఎగదండి రవీందర్, మహిపాల్, మాజీ ఉపసర్పంచ్ ఎరవెల్లి నాగరాజు, జగన్, కిసాన్, మురళి, రాజు, పవన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని ఉజ్వల ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు బోనాలతో ఆలయం వద్దకు వెళ్లి బోనం మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ విక్రుతి అరుణాద్రి, పంజాల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన



మాట్లాడుతున్న ఎంఈవో బన్నాజీ

ముస్తాబాద్: పిల్లల్లో ఎనీమియా నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంఈవో బన్నాజీ కోరారు. ముస్తాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో రక్తహీనతపై ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల్లో రక్తహీనతపై అవగాహన కల్పించాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా విద్యార్థుల్లో రక్తహీనత నివారించవచ్చన్నారు. నోడల్ ఆఫీసర్ రాజిరెడ్డి, హెచ్‌ఎంలు రాధాకిషన్‌రావు, రాజేశ్వరి, కాంప్లెక్స్ సిబ్బంది పాల్గొన్నారు.